క్లుప్తంగా

అభివృద్ధి పనుల కోసం వినతి



నిజామాబాద్ రూరల్: నగర కార్పొరేషన్ పరిధి లోని ఖానాపూర్‌లో శ్మశాన వాటికకు ప్రహరీ, స్నానాల గదులు, బోరుబావి తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఎస్సీ కుల సంఘం నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఒకటో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోర్వ రాజేంద్రప్రసాద్, సీహెచ్ నర్సారెడ్డి, మోహన్, శ్రీనివాస్, రామోళ్ల మోహన్, పెద్దబాబు తదితరులున్నారు.

విద్యార్థులకు అభినందన



సిరికొండ: సత్యశోధక్ పాఠశాలకు చెందిన స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, డీఈవో అశోక్ గురువారం అభినందించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 75 వసంతాల రాష్ట్ర స్థాయి స్కౌట్స్, గైడ్స్ డైమండ్ జూబ్లీ వేడుకల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు కలెక్టర్‌తోపాటు డీఈవోను కలిశారు. స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సాల్మన్, ప్రిన్సిపాల్ నర్సయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో అర్గుల్ సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి తండ్రి రాజన్న ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా గంగారెడ్డిని ఓదార్చి సానుభూతి తెలిపారు. ఆయన వెంట జక్రాన్‌పల్లి మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగ్యానాయక్, నాయకులు జితేందర్‌నాయక్, రిక్కల సురేశ్, జైడి మల్లేశ్, లాల్‌సింగ్, రాయల్, మహేశ్ తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి



మోపాల్: మండలంలోని గ్రామపంచాయతీ కారోబార్లు, పారిశుద్ధ్య కార్మికులకు తమకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు జంగం గంగాధర్ మాట్లాడుతూ.. ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో కారోబార్లు, పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీటీవో కార్యాలయంలో చెక్కులు జమ చేసినప్పటికీ.. క్లియరెన్స్ కాలేదని వాపోయారు. ఇటీవల ప్రభుత్వం జీతాల కోసం నిధులు మంజూరు చేసినా.. స్థానిక అధికారులు మాత్రం ఇతర ఖర్చుల కింద జమ చేసుకున్నారని ఆరోపించారు. కారోబార్లు నందు, శ్రీనివాస్, వేణు, అరుణ్‌కుమార్, మహిపాల్, సావిత్రి, ముఖేశ్, బంతిలాల్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి



మోపాల్: రాష్ట్రంలోని పేదలకు నాణ్యమైన విద్య, వైద్యంతోపాటు ఉపాధి కల్పించాలని, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రశాంత్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు గురువారం ఆర్ఐ రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, మహేశ్, గంగాధర్, అజేంద్రపాల్ పాల్గొన్నారు.

మోడల్ పాఠశాల తనిఖీ



బాల్కొండ: ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్‌పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సర్వే డాటా ఎంట్రీ షురూ

- 93 వేల గృహాలకు డాటా ఎంట్రీ
- 300 మంది సిబ్బందికి శిక్షణ
- రెండు షిఫ్టుల్లో నమోదు కార్యక్రమం
- ఎప్పటికప్పుడు పరిశీలించనున్న సూపర్‌వైజర్లు



శిక్షణలో పాల్గొన్న డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మున్సిపల్ కమిషనర్ దిలీప్

నిజామాబాద్ సిటీ : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే కార్యక్రమం నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు పూర్తికావొచ్చింది. ఈ నెల 6 నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభంకాగా, మొదటి వారం రోజులు ఇంటింటికి తిరిగి స్టిక్కరింగ్ వేశారు. 10 నుంచి ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి సమాచారం సేకరించారు. డాటాను కంప్యూటర్‌లలో నిక్షిప్తం చేసే పని డాటా ఎంట్రీని సైతం మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం ప్రారంభించారు.

80 వేల ఇళ్ల సర్వే పూర్తి

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 93 వేల గృహాలను అధికారులు గుర్తించారు. వాటిని 725 బ్లాక్‌లుగా విభజించి సర్వే చేసేందుకు 725 మంది ఎన్యుమరేటర్లను, వారిపై 73 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఇప్పటివరకు 80,542 గృహాల సర్వే పూర్తిచేసినట్లు కమిషనర్ దిలీప్ తెలిపారు.

షిఫ్టులవారీగా డాటా ఎంట్రీ

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డాటా ఎంట్రీ కోసం ఓ హాల్‌ను సిద్ధం చేశారు. ప్రస్తుతం 40 కంప్యూటర్లను అందుబాటులో ఉంచగా, రెండు షిఫ్టుల్లో పనిచేసేందుకు సిబ్బందిని నియమించారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక షిఫ్టు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రెండోషిఫ్టు ద్వారా డాటా ఎంట్రీ చేయనున్నారు. ప్రతి 10 మందికి ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. డాటా ఎంట్రీ చేసిన వాటిలో రాండమ్‌గా 10 శాతం ఎంట్రీలను పూర్తిగా క్రాస్ చెక్ చేయనున్నారు. ఈ నెలాఖరువరకు పూర్తి డాటాను ఎంట్రీ చేయనున్నారు.

82 శాతం సర్వే పూర్తి



మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం నాటికి 82 శాతం సర్వే పూర్తయ్యింది. 93 వేల ఎంట్రీల్లో 80,8542 గృహాల్లో సర్వే చేశారు. డాటా ఎంట్రీ కూడా ప్రారంభించాం. గడువులోగా డాటా ఎంట్రీ పూర్తిచేస్తాం. అబ్జర్వర్లు వచ్చి రాండమ్‌గా చెక్ చేస్తారు.

– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

ప్రైవేట్ వ్యక్తులకు ఎంట్రీ విధులు

93వేల గృహాల సమాచారం కంప్యూటర్‌లలో ఎంట్రీ చేసేందుకు అధికారులు ఇతరులపై ఆధారపడ్డారు. కార్పొరేషన్ పరిధిలోని కంప్యూటర్ ఆపరేటర్లతోపాటు ఇతర నిపుణులు, ఇంజినీరింగ్ విద్యార్థులు, వృత్తినైపుణ్యం గలవారిని నియమించారు. వారికి కార్పొరేషన్ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఎంట్రీలో వరుస సంఖ్య 1 నుంచి 76 వరకు పూర్తిగా అవగాహన కల్పించారు. డాటా ఎంట్రీ ఖచ్చితంగా నమోదుచేయాలని కమిషనర్ సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం విధించిన గడువులోగా సర్వే వివరాలు డాటా ఎంట్రీ పూర్తిచేస్తామని కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ



ధర్పల్లిలో శిక్షణలో పాల్గొన్న అధికారులు



సిరికొండలో..

ధర్పల్లి: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయనున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లకు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం శిక్షణ ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. సర్వే వివరాల నమోదులో ఆపరేటర్లు ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దన్నారు. అలాగే కుటుంబాల వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. సర్వే వివరాలు నమోదు విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆపరేటర్లకు వివరించారు. డీపీఎం నరహరి, ఎంపీడీవో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

సిరికొండ: సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎంపీడీవో కేఆర్ మనోహర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సర్వే వివరాల నమోదుపై శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీవో తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న పారిశుధ్య పనులను కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. గురువారం తెల్లవారుజామున ఆయన నగరంలోని పలు డివిజన్‌లలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. పారిశుధ్య సిబ్బంది హాజరును పరిశీలించారు. కంఠేశ్వర్, ఖలీల్‌వాడి, పూలాంగ్, వినాయక్‌నగర్‌లో పర్యటించారు.

జిల్లాస్థాయి నెట్‌బాల్‌లో ప్రతిభ



డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన నెట్‌బాల్ టోర్నీలో ప్రతిభకనబర్చిన మండలంలోని సుద్దులం పాఠశాల విద్యార్థులను వీడీసీ సభ్యులు, టీచర్లు అభినందించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్, క్యాషియర్ గంగాధర్, స్కూల్ చైర్మన్ రాజగంగు ఆధ్వర్యంలో స్పోర్ట్స్ యూనిఫామ్స్ కోసం రూ.10,500 అందజేశారు. హెచ్ఎం గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

విమర్శించే స్థాయి మానాలకు లేదు



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్ అర్బన్ : మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి లేదని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని విమర్శించారు. ఏ గ్రామానికి వెళ్లినా కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని పరిశీలిద్దామన్నారు. సమావేశంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నాయులు రాజు, సత్యప్రకాశ్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్

బాల్కొండ: ఉద్యోగుల హక్కుల సాధన కోసం సంఘటితమై కృషి చేద్దామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్ అన్నారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద ఎస్సారెస్పీ యూనిట్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని, టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి పోల శ్రీనివాస్, ఎస్సారెస్పీ యూనిట్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నులు పంపిణీ



నిజామాబాద్ రూరల్ : మండలంలోని మాధవనగర్‌కు చెందిన కొంగర రోహిత్ గతేడాది అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వామపక్ష నాయకులు వి ప్రభాకర్, రవీందర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రోహిత్ చక్రాల కుర్చీకే పరిమితం కాకుండా ఉన్నత విద్యను అభ్యసించాడని, పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పారన్నారు. రోహిత్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. రోహిత్ తల్లిదండ్రులు కొంగర శ్రీనివాసరావు, నీరజ, సోదరుడు రాహుల్, సింగిల్ విండో చైర్మన్ దాసరి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు, న్యూడెమోక్రసీ నాయకులు శ్రీధర్, కార్పొరేటర్ ప్రమోద్, బంటు గణేశ్, లావు వీర య్య, బాలగంగాధర్, సుధాకర్, గణేశ్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే



దివ్యాంగ విద్యార్థులతో క్యారం ఆడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్‌నాగారం: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమేనని, దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీలను అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన క్యారం ఆడారు. దివ్యాంగులు సాధించిన విజయాలను ఆయన వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. క్రీడాపోటీల విజేతలకు వచ్చే నెల 3న బహుమతులు అందజేస్తామని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి రసూల్ బీ తెలిపారు. స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలోజిల్లా శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఇందిర, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, ఏపీ ఫోరం సెక్రెటరీ స్వరూప, గ్రేసీ డెఫ్ స్కూల్ నిర్వాహకురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలకు నిరసనగా ఉద్యమిద్దాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాల ఐక్య కార్యకరణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ముష్క సుధాకర్, ఎస్.దాసు, కంజర భూమయ్య మాట్లాడుతూ... పెరుగుతున్న నిత్యావసర వస్తువుల, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే చర్యలను నిలిపివేయాలన్నారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన తెలుపుతామన్నారు. ఐక్య కార్యాచరణ నాయకులు వి ప్రభాకర్, సూర్జహాన్, భాస్కర్, వెంకటేశ్, సాయన్న, రమేశ్‌బాబు, శివకుమార్, గంగారెడ్డి, రాజేశ్వర్, శివకుమార్, గణేశ్, సాయిబాబా, పోశెట్టి పాల్గొన్నారు.

ఉర్దూ భాషలో మరిన్ని పరిశోధనలు చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖవి ప్రతిష్టాత్మక రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణ ఉర్దూ అకాడమీ ద్వారా పరిశోధన– విమర్శ రంగంలో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవం అభినందనీయమని వైస్ చాన్సలర్ యాదగిరిరావు అన్నారు. గురువారం తన చాంబర్‌లో అబ్దుల్ ఖవిని వీసీ గురువారం సన్మానించారు. ఉర్దూ పరిశోధన రంగంలో మరింత లోతుగా పరిశోధనలు చేసి విశ్వవిద్యాలయానికి గుర్తింపు తీసుకురావాలని వీసీ సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షుడు డాక్టర్ పున్నయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌బాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కోశాధికారి డాక్టర్ నాగరాజు, డాక్టర్ జమీల్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ నీలిమా, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు, అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి



ఆపరేటర్లకు అవగాహన కల్పిస్తున్న మండల ప్రత్యేక అధికారి యోహాన్

డిచ్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ (కులగణన) సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ ని తప్పులు లేకుండా నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి యోహాన్ సూచించారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిందన్నారు. ఇంటింటికి తిరిగి ఎన్యుమరేటర్లు సేకరించిన కుటుంబాల వివరాలను ఆన్లైన్ ద్వారా తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంతోపాటు సెట్విన్, తిరుమల మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఇందు కోసం 60 మందికి పైగా డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఎమ్మార్ఐ సంతోష్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.





వీసీ యాదగిరిరావుకు వినతిపత్రం అందజేస్తున్న టీజీవీపీ, పీడీఎస్‌యూ నాయకులు

ఖాళీ సీట్లను భర్తీ చేయండి

తెయూ (డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ పీజీ, పీజీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ), పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరారావును వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్సిటీలో పీజీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సుల్లో ప్రతి ఏటా పదుల సంఖ్యలో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయన్నారు. గ్రామీణ, పేద, మధ్య తరగతి ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు.

వీసీని కలిసిన వారిలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, నగర అధ్యక్షుడు అఖిల్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, టీజీవీపీ నాయకులు అఖిల్, నగేశ్, శేషి, వినయ్, అజయ్, పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, రవీందర్, రాకేశ్, బాలాజీ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 29ని రద్దు చేయాలి



సెంట్రల్ లైబ్రరీ ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలో గ్రూప్–1 నియామకాల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ వర్గాల అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే జీవో నెంబర్ 29ను రద్దు చేసి జీవో నంబర్ 55ని పునరుద్ధరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కర్క గణేశ్ డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ సెంటల్ లైబ్రరీ ఎదుట విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రూప్స్ అభ్యర్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు. వెంటనే జీవో నెంబర్ 29 ను రద్దు చేసిన తర్వాతనే గ్రూప్–1 మెయిన్స్ ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి పెద్ద ఎత్తు అందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, రమేశ్, రాజు, గ్రూప్ అభ్యర్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

మోపాల్: మండలకేంద్రంలో ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ 55వ వార్షికోత్సవం సందర్భంగా రైతులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) ప్రోగ్రాంలో భాగంగా రైతులు, వృద్ధులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో కంపెనీ సేల్స్ మేనేజర్ రామకృష్ణ, ప్రతినిధి టి భూపతి, రైతులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,400	వెండి(కిలో)	96,000
22 క్యారెట్స్	73,260		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	30	గాజరుగడ్డ	70	100
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	30	50	దోసకాయ	30	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	35	60
బీర్నిసుకాయ	50	80	గోబిగడ్డ	30	60
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	90
వంకాయ	40	60	బీట్‌రూట్	50	90
పాలకూర	30	50	కరివేపాకు	50	70
మెంతికూర	70	90	చామగడ్డ	40	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మెకానిక్ రాకీ (తెలుగు)-10.30 10.20. దేవకినందన వాసుదేవ(తెలుగు)-1.30 7.30. లక్కీ భాస్కర్(తెలుగు)-4.30
స్క్రీన్-3	అమరన్ (తెలుగు) - 10.20. 7.30. 10.30. జిబ్రా (తెలుగు) - 1.30. మెకానిక్ రాకీ (తెలుగు) - 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	అమరన్ (తెలుగు) - 12.00. 3.30. 7.00. 10.30
స్క్రీన్-2	మెకానిక్ రాకీ (తెలుగు) - 11.45. 3.00. 6.15. 9.30
స్క్రీన్-3	మందిర (తెలుగు) - 10.45. కనక మహాలక్ష్మి (తెలుగు) - 1.30. క (తెలుగు) - 4.00. జిబ్రా(తెలుగు)-7.15 10.40
స్క్రీన్-4	లక్కీ భాస్కర్ (తెలుగు) - 1.00. 7.05. దేవకి నందన వాసుదేవ (తెలుగు) - 4.15. 10.20
లలితామహల్	దేవకి నందన వాసుదేవ (తెలుగు)
దేవి	మెకానిక్ రాకీ (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)